# ఈ ఏడాది ఆఖర్లో మారుతి ఈవీ

గాంధీనగర్, జనవరి 11: దేశవ్యాప్తంగా ఎలక్ట్రిక్ వాహనాలకు పెరుగుతున్న గిరాకీని దృష్టిలో పెట్టుకొని కార్ల తయారీలో అగ్రగామి సంస్థయైన మారుతి సుజుకీ ఈ మాడల్‌ను విడుదల చేయడానికి సిద్ధమైంది. ఈ ఏడాది చివరినాటికి తన తొలి ఎలక్ట్రిక్ వాహనాన్ని విడుదల చేయబోతున్నట్లు కంపెనీ వర్గాలు సూచనప్రాయంగా చెప్పాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోనే రూ.750 కోట్ల లిథియం-అయాన్ బ్యాటరీ సెల్స్, మాడ్యుల్స్‌ను ఇతర దేశాలకు ఎగుమతి చేయాలనుకుంటున్నట్లు మారుతి సుజుకీ ఈడీ రాహుల్ భారతి తెలిపారు. ఈ ఏడాదిలోనే దేశీయ మార్కెట్లోకి ఈవీని విడుదల చేయడంతోపాటు యూరప్, జపాన్ దేశాలకు ఎగుమతి చేసే ఆలోచన కూడా సంస్థకు ఉన్నదన్నారు. గుజరాత్‌లో తోషిబా కార్పొరేషన్, డెన్సో కార్పొరేషన్, సుజుకీ మోటర్ కార్పొరేషన్‌లు కలిసి లిథియం-అయాన్ బ్యాటరీ ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తున్నాయి.



# ఐఐటీ-హెచ్‌తో ఎఫ్‌టీసీసీఐ ఒప్పందం

హైదరాబాద్, జనవరి 11(నమస్తే తెలంగాణ): పరిశ్రమ ఎదుర్కొంటున్న సవాళ్లను పరిష్కరించడానికి ఎఫ్‌టీసీసీఐ నడుంబిగించింది. ఇందుకోసం నూతన సాంకేతిక పరిజ్ఞానంతో అధిగమించేందుకుగాను ఐఐటీ-హైదరాబాద్ సహకారం తీసుకోనున్నది. భవిష్యత్తు ప్రణాళికలకు తగ్గట్టుగా నూతన ఆవిష్కరణల ద్వారా పరిశ్రమకు తగిన చేయూతను అందించేందుకుగాను ఈ ఒప్పందం చేసుకున్నట్టు ఎఫ్‌టీసీసీఐ వర్గాలు వెల్లడించాయి. ఈ సందర్భంగా ఐఐటీ-హైదరాబాద్ వ్యవస్థాపక డైరెక్టర్ ఉదయ్ దేశాయ్ మాట్లాడుతూ..రోజురోజుకు కొత్త పుంతలు తొక్కుతున్న నూతన సాంకేతికతలపై పరిశ్రమ ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉన్నదని, శరవేగంగా అభివృద్ధి చెందుతున్న డిజిటల్ రంగంలో అపారమైన ఉద్యోగ అవకాశాలున్నాయన్నారు. కృత్రిమ మేధస్సు, మెషిన్ లెర్నింగ్ రంగాలు వచ్చే పదేండ్లలో అత్యంత కీలకపాత్ర పోషించనున్నట్లు చెప్పారు.



# జియో నయా రోమింగ్

## అంతర్జాతీయ ప్లాన్లను తెచ్చిన సంస్థ • ఇన్-ఫ్లైట్ కోసమూ పరిచయం

న్యూఢిల్లీ, జనవరి 11: దేశీయ టెలికం రంగ దిగ్గజం రిలయన్స్ జియో మూడు సరికొత్త రకాల్లో అంతర్జాతీయ రోమింగ్ ప్లాన్లను పరిచయం చేసింది. ఇందులో భాగంగానే యూఏఈ, యూఎస్‌ఏ, వార్షిక ప్యాకేజీలను ప్రకటించింది. వీటిలోనే ఉచిత ఇన్-ఫ్లైట్ ప్రయోజనాలతోనూ ప్రత్యేకంగా ప్లాన్లను తీసుకొచ్చింది. అలాగే వన్‌డే ఇన్-ఫ్లైట్ డాటా, వాయిస్ ప్లాన్లనూ ప్రవేశపెట్టింది. ఆ వివరాల్లోకి వెళ్తే..

**యూఏఈ ప్యాక్‌లో..**

21 రోజుల వ్యాలిడిటీ ప్లాన్ ధర రూ.2,998గా, 14 రోజులది రూ.1,598గా, 7 రోజులది రూ.898గా ఉన్నాయి. రూ.2,998 ప్లాన్‌లో 250 నిమిషాల చొప్పున ఇన్‌కమింగ్, ఔట్‌గోయింగ్ వాయిస్ కాల్స్ ఉంటాయి. 7జీబీ డాటా, 100 ఎస్‌ఎంఎస్‌లు వస్తాయి. రూ.1,598 ప్లాన్‌లో 150 నిమిషాల చొప్పున ఇన్‌కమింగ్, ఔట్‌గోయింగ్ వాయిస్ కాల్స్, 3జీబీ డాటా, 100 ఎస్‌ఎంఎస్‌లు లభిస్తాయి. రూ.898 ప్లాన్‌లో 100 నిమిషాల చొప్పున ఇన్‌కమింగ్, ఔట్‌గోయింగ్ కాల్స్, 1జీబీ డాటా, 100 ఎస్‌ఎంఎస్‌లుంటాయి.

**వార్షిక ప్లాన్**

వార్షిక అంతర్జాతీయ రోమింగ్ ప్లాన్ ధర రూ.2,799. ఇందులో 2జీబీ డాటా లభిస్తుంది. 100 నిమిషాల వాయిస్ కాల్స్ (ఇన్‌కమింగ్, ఔట్‌గోయింగ్) ఉంటాయి. 100 ఎస్‌ఎంఎస్‌లుంటాయి. 51 దేశాల్లో చెల్లుబాటు అవుతుంది.

**అమెరికా ప్యాక్‌లో..**



30 రోజుల వ్యాలిడిటీ ప్లాన్ ధర రూ.3,455గా ఉన్నది. అలాగే 21 రోజులది రూ.2,555, 10 రోజులది రూ.1,555గా ఉన్నాయి. రూ.3,455 ప్లాన్‌లో 250 నిమిషాల చొప్పున వాయిస్ కాల్స్, 25జీబీ డాటా, 100 ఎస్‌ఎంఎస్‌లుంటాయి. రూ.2,555 ప్లాన్‌లో 250 నిమిషాల వాయిస్ కాల్స్, 15జీబీ డాటా, 100 ఎస్‌ఎంఎస్‌లుంటాయి. రూ.1,555 ప్లాన్‌లో 150 నిమిషాల వాయిస్ కాల్స్, 7జీబీ డాటా, 100 ఎస్‌ఎంఎస్‌లున్నాయి.

**ఇన్-ఫ్లైట్ ప్లాన్లలో..**



- 250ఎంబీ డాటాతో రూ.195 ప్లాన్‌ను తెచ్చింది. 500ఎంబీ డాటాతో రూ.295, 1జీబీ డాటాతో రూ.595గా ఉన్నాయి. ఈ ప్లాన్ల వ్యాలిడిటీ ఒక్కరోజే. 100 నిమిషాల వాయిస్ కాల్స్, 100 ఎస్‌ఎంఎస్‌ల సౌకర్యం ఉంటుంది. 22 ఎయిర్‌లైన్స్‌ల్లో చెల్లుబాటు అవుతుంది. ఇక వాయిస్, డాటా ప్యాక్‌లతో ఫ్రీ ఇన్-ఫ్లైట్ ప్రయోజనాలున్న ప్లాన్ల ధర రూ.2,499, రూ.3,999, రూ.4,999, రూ.5,999గా ఉన్నాయి.
- రూ.2,499 ప్లాన్ వ్యాలిడిటీ 10 రోజులు. డాటా 250ఎంబీ. 100 నిమిషాల ఔట్‌గోయింగ్, ఉచిత ఇన్‌కమింగ్ వాయిస్ కాల్స్ సదుపాయం ఉంటుంది. రోజుకు 100 ఎస్‌ఎంఎస్‌లుంటాయి. 35 దేశాల్లో చెల్లుతుంది.
- రూ.3,999 ప్లాన్ వ్యాలిడిటీ 30 రోజులు. డాటా 4జీబీ. 250 నిమిషాల ఔట్‌గోయింగ్, ఉచిత ఇన్‌కమింగ్ వాయిస్ కాల్స్ ఉంటాయి. 100 ఎస్‌ఎంఎస్‌లు. 51 దేశాల్లో కవరేజీ ఉంటుంది.
- రూ.4,999 ప్లాన్ వ్యాలిడిటీ 30 రోజులు. డాటా 5జీబీ. 1,500 నిమిషాలు ఔట్‌గోయింగ్, ఉచిత ఇన్‌కమింగ్ వాయిస్ కాల్స్ ఉంటాయి. 1,500 ఎస్‌ఎంఎస్‌లు చేసుకోవచ్చు. 35 దేశాలకు వర్తిస్తుంది.
- రూ.5,999 ప్లాన్ వ్యాలిడిటీ 30 రోజులు. డాటా 6జీబీ. 400 నిమిషాల ఔట్‌గోయింగ్ (లోకల్, ఇండియా, ఆర్‌వో డబ్ల్యూ, వైఫై) ఉచిత ఇన్‌కమింగ్ కాల్స్, 500 ఎస్‌ఎంఎస్‌లుంటాయి.



# పన్ను వసూళ్లలో 19 శాతం వృద్ధి

న్యూఢిల్లీ, జనవరి 11: ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు రూ.14.70 లక్షల కోట్ల నికర ప్రత్యక్ష పన్ను వసూలయ్యాయి. ఈసారికిగాను ప్రవేశపెట్టిన సార్వత్రిక బడ్జెట్ లక్ష్యంలో 81 శాతం వసూలైనట్లు కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు(సీబీడీటీ) వెల్లడించింది. క్రితం ఏడాది ఇదే సమయంలో వసూలైనదాంతో పోలిస్తే ఇది 19.41 శాతం అధికమని పేర్కొంది. 2023-24 ఆర్థిక సంవత్సరానికిగాను ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రూ.18.23 లక్షల కోట్ల పన్ను వసూళ్లు లక్ష్యంగా పెట్టుకున్న విషయం తెలిసిందే. క్రితం ఏడాది వసూలైన రూ.16.61 లక్షల కోట్ల కంటే ఇది 9.75 శాతం అధికం. అలాగే ఏప్రిల్ 1, 2023 నుంచి జనవరి 10, 2024 వరకు రూ.2.48 లక్షల కోట్ల రిఫండ్ రూపంలో చెల్లింపులు జరిపింది.

# 100 బిలియన్ డాలర్ల క్లబ్‌లో..

## ఫోర్బ్స్ బిలియనీర్లలో 11వ స్థానంలో రిలయన్స్ అధినేత



న్యూఢిల్లీ, జనవరి 11: రిలయన్స్ ఇండస్ట్రీస్ గ్రూప్ అధినేత ముకేశ్ అంబానీ తాజాగా తిరిగి 100 బిలియన్ డాలర్ల క్లబ్‌లో చేరారు. వరుస రెండు రోజుల ర్యాలీతో రిలయన్స్ షేరు ఆల్‌టైమ్ గరిష్ఠస్థాయికి చేరడంతో ఫోర్బ్స్ రియల్ టైమ్ జాబితా ప్రకారం ముకేశ్ సంపద 105.1 బిలియన్ డాలర్లకు (రూ.8.75 లక్షల కోట్లు) చేరింది. దీంతో గ్లోబల్ బిలియనీర్లలో ప్రస్తుతం అంబానీ 11వ స్థానంలో ఉన్నారు. ఈ ప్రపంచ జాబితాలో 100 బిలియన్ డాలర్ల క్లబ్‌లో మొత్తం 12 మంది ఉన్నారు. బుధ, గురువారాల్లో రిలయన్స్ ఇండస్ట్రీస్ (ఆర్‌ఐఎల్) షేరు 5.4 శాతం పెరిగి రూ.2,720 రికార్డుస్థాయి వద్ద ముగిసింది. ఆర్‌ఐఎల్ మార్కెట్ విలువ రూ.18 లక్షల కోట్లను మించింది. ఈ కంపెనీలో అంబానీ కుటుంబానికి మెజారిటీ వాటా ఉన్నది. వాస్తవానికి గత జులైలోనే ఆర్‌ఐఎల్ షేరు రూ.2,850 వద్దకు పెరిగినప్పటికీ, ఈ కంపెనీ నుంచి ఎన్‌బీఎఫ్‌సీ సబ్సిడరీ జియో ఫైనాన్షియల్ సర్వీసెస్‌ను విభజించడంతో స్టాక్ ఎక్స్ఛేంజీలు నిర్వహించిన ప్రత్యేక ట్రేడింగ్‌లో ఆర్‌ఐఎల్ షేరు ధర రూ.2,630 వద్ద స్థిరపడింది. గురువారం జియో ఫైనాన్షియల్ షేరు 4.7 శాతం పెరిగి రూ.251 వద్ద నిలిచింది. ఆర్‌ఐఎల్ గ్రూప్‌లోని మరో కంపెనీ టీవీ18 బ్రాడ్‌కాస్ట్ వరుసగా 5 ట్రేడింగ్ సెషన్లలో 25 శాతం పెరిగింది. ముకేశ్ అంబానీ 2021లో తొలుత 100 బిలియన్ డాలర్ల క్లబ్‌లో ప్రవేశించినప్పటికీ, అటుతర్వాత ఆ స్థానాన్ని కోల్పోయారు. ప్రస్తుతం ఫోర్బ్స్ రియల్‌టైమ్ కుబేరుల జాబితాలో గౌతమ్ అదానీ 16వ స్థానంలో ఉన్నారు. టెస్లా అధినేత ఎలాన్ మస్క్ 240.9 బిలియన్ డాలర్ల సంపదతో అగ్రస్థానంలో కొనసాగుతుండగా, ఫ్రాన్స్ ఫ్యాషన్ వాణిజ్యవేత్త బెర్నార్డ్ ఆర్నాల్ట్, అమెజాన్ హెడ్ జెఫ్ బెజోస్‌లు ద్వితీయ, తృతీయ స్థానాల్లో ఉన్నారు.

# టీసీఎస్ లాభం 11,058 కోట్లు

## ఆదాయం రూ.60,583 కోట్లు • షేరుకు రూ.27 డివిడెండ్ ప్రకటించిన కంపెనీ



ముంబైలోని ప్రధాన కార్యాలయంలో ఆర్థిక ఫలితాల విడుదల సందర్భంగా సంస్థ సీవోవో, సీఎఫ్‌వోలతో టీసీఎస్ సీఈవో కే కృతివాసన్

ముంబై, జనవరి 11: దేశీయ ఐటీ దిగ్గజం టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) విశ్లేషకుల అంచనాలకు దగ్గరగా ఆర్థిక ఫలితాల్ని వెల్లడించింది. 2023 డిసెంబర్‌తో ముగిసిన మూడవ త్రైమాసికంలో టీసీఎస్ నికరలాభం అంతక్రితం ఏడాది ఇదేకాలంతో పోలిస్తే 2 శాతం వృద్ధితో రూ.11,058 కోట్లకు పెరిగింది. ఆదాయం 4 శాతం పెరిగి రూ.60,583 కోట్లకు చేరింది. క్యూ2తో పోలిస్తే క్యూ 3లో ఆదాయం 1.5 శాతం పెరగ్గా, లాభం 2.5 శాతం తగ్గింది. లీగల్ క్లెయిం సెటిల్‌మెంట్ కోసం రూ.958 కోట్లు కేటాయించడం క్యూ 3లో లాభం పరిమితంగా నమోదయ్యింది. మెజారిటీ బ్రోకరజ్ సంస్థలు రూ.60,119 కోట్ల ఆదాయాన్ని, రూ.11,446 కోట్ల నికరలాభాన్ని అంచనా వేశాయి. గురువారం సమావేశమైన టీసీఎస్ డైరెక్టర్ల బోర్డు షేరుకు రూ.18 ప్రత్యేక డివిడెండ్ రూ.9 మధ్యంతర డివిడెండ్ కలిపి మొత్తం రూ.27 డివిడెండ్‌ను సిఫార్సు చేసింది.

**8.1 బిలియన్ డాలర్ల డీల్స్**

మూడవ త్రైమాసికంలో టీసీఎస్ 8.1 బిలియన్ డాలర్ల విలువైన డీల్స్‌ను చేజిక్కించుకుంది. అయితే సెప్టెంబర్‌లో సంపాదించిన 11.2 బిలియన్ డాలర్ల కాంట్రాక్టులకంటే క్యూ3లో తక్కువగానే సాధించింది. కంపెనీ ఇబిట్ మార్జిన్ 24.3 శాతం నుంచి 25. శాతానికి పెరిగింది. ప్రాంతాలవారీగా చూస్తే టీసీఎస్ యూకే ఆదాయం 8.1 శాతం వృద్ధి చెందగా, ఉత్తర అమెరికాలో 3 శాతం తగ్గింది. కానీ భారత్‌తో సహా ఇతర వర్ధమాన మార్కెట్లలో కంపెనీ ఆదాయాన్ని భారీగా 23.4 శాతం పెంచుకుంది. మిడిల్ ఈస్ట్, ఆఫ్రికాలో 16 శాతం, లాటిన్ అమెరికాలో 13.4 శాతం ఆసియా ఫసిఫిక్‌లో 3.9 శాతం చొప్పున పెరిగింది. వివిధ రంగాల ప్రకారం చూస్తే అత్యధిక భాగం ఆదాయాన్ని ఆర్జించిపెట్టే బీఎఫ్‌ఎస్‌ఐ విభాగంలో 3 శాతం తగ్గింది. మీడియా, కమ్యూనికేషన్స్ విభాగంలో ఆదాయం 4.9 శాతం, టెక్నాలజీ సర్వీసుల్లో ఆదాయం 5 శాతం చొప్పున తగ్గింది. ఎనర్జీ, యుటిలిటీస్ విభాగాల ఆదాయం 11.8 శాతం, తయారీ రంగం ఆదాయం 7 శాతం లైఫ్ సైన్సెస్, హెల్త్‌కేర్ ఆదాయం 3.1 శాతం చొప్పున పెరిగింది.

**ఉద్యోగుల సంఖ్య 6,03,305**

డిసెంబర్ 31నాటికి టీసీఎస్‌లో 6,03,305 మంది ఉద్యోగులున్నారు. వలసల రేటు క్యూ2లో 14.9 శాతం ఉండగా, క్యూ3లో 13.3 శాతానికి తగ్గింది. వచ్చే ఏడాది కోసం తాము కాలేజ్ క్యాంపస్ నియామకాల ప్రక్రియ ప్రారంభించామని టీసీఎస్ చీఫ్ హెచ్ఆర్ మిలింద్ లక్కడ్ తెలిపారు.

# నిరాశపరిచిన ఇన్ఫోసిస్

## క్యూ3లో లాభం 7.3 శాతం తగ్గి రూ.6,106 కోట్లు

న్యూఢిల్లీ, జనవరి 11: దేశీయ టెక్నాలజీ దిగ్గజాల్లో ఒకటైన ఇన్ఫోసిస్ నిరాశాజనక ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికానికిగాను కంపెనీ కన్సాలిడేటెడ్ నికర లాభం 7.3 శాతం తగ్గి రూ.6,106 కోట్లకు పరిమితమైంది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో సంస్థ రూ.6,586 కోట్ల నికర లాభాన్ని గడించిన విషయం తెలిసిందే. సమీక్షకాలంలో కంపెనీ కన్సాలిడేటెడ్ ఆదాయం రూ.38,318 కోట్ల నుంచి రూ.38,821 కోట్లకు చేరుకున్నది. వృద్ధి పరంగా చూస్తే 1.3 శాతం పెరిగింది. క్లయింట్ల నుంచి డిమాండ్ పడిపోవడం, వార్షిక విక్రయాలు అంచనాల్లో కోత విధించడంతో లాభాలపై ప్రతికూల ప్రభావం చూపాయని పేర్కొన్నారు.

**ఆదాయ గైడెన్స్‌లో మార్పు**

నిరాశాజనక ఆర్థిక ఫలితాలు ప్రకటించిన ఇన్ఫోసిస్..భవిష్యత్తుపై ఆందోళనను వ్యక్తంచేసింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఆదాయంలో వృద్ధి 1-2.5 శాతంగా ఉంటుందని గతంలో అంచనావేసిన కంపెనీ..ఈసారి మాత్రం దీనిని 1.5-2 శాతానికి కుదించింది. అప్పర్‌లో తగ్గించిన సంస్థ..లోయర్‌లో మాత్రం పెంచింది.



- బెంగళూరుకు చెందిన సెమికండక్టర్ డిజైన్ సర్వీస్ ప్రొవైడర్ ఇన్‌సెమీని రూ.280 కోట్లకు కొనుగోలు చేసింది. దీనికి బోర్డు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ప్రస్తుత త్రైమాసికం నాటికి ఈ ఒప్పందం పూర్తికానున్నది.
- ఆర్థిక సేవలు, టెల్కో, హై టెక్నాలజీ సేవలపై సంస్థ దృష్టి సారించింది. తయారీ, ఎనర్జీ, యుటిలిటీ, లైఫ్ సైన్సెస్ రంగాలు ఆశాజనక పనితీరు కనబరిచాయి.

*మూడో త్రైమాసిక ఫలితాలు స్థిరంగా ఉన్నాయి. 3.2 బిలియన్ డాలర్ల విలువైన ఒప్పందాలు కుదుర్చుకున్నాం. వీటిలో కొత్తగా వచ్చినవి 71 శాతం. కృత్రిమ మేధస్సు, డిజిటల్, క్లౌడ్, ఆటోమేషన్ సేవలకు డిమాండ్ అధికంగా ఉండటంతో గత తొమ్మిది త్రైమాసికాల్లో ఇంతటి స్థాయిలో రావడం ఇదే తొలిసారి. తొలి మూడు త్రైమాసికాల్లో పనితీరు ఆధారంగా నాలుగో త్రైమాసికం అవుట్‌లుక్‌ను డిసైడ్ చేస్తుండటంతో ఆదాయ అంచనాను తగ్గించడం జరిగింది.*

***- సలీల్ పరేఖ్, ఇన్ఫోసిస్ సీఈవో, ఎండీ***

- డిసెంబర్ చివరినాటికి ఉద్యోగులు ఏడు శాతం తగ్గి 3,22,663లకు చేరుకున్నారు. రెండో త్రైమాసికంతో పోలిస్తే 1.8 శాతం తగ్గారు
- ప్రపంచవ్యాప్తంగా టెక్నాలజీ సేవలకు డిమాండ్ అంతకంతకు పడిపోతుండటంతో క్యాంపస్ హైరింగ్‌కు వెళ్లే అవకాశాలు లేవని స్పష్టంచేసింది.
- సెమికండక్టర్ల మార్కెట్ విలువ 500 బిలియన్ డాలర్ల నుంచి ట్రిలియన్ డాలర్ల స్థాయికి చేరుకుంటుందని అంచనా.

# తయారీలో వెల్డింగ్ టెక్నాలజీ కీలకం

## ఏడబ్ల్యూటీఎన్‌ఎంపీ చైర్మన్ జైతీర్థ్ ఆర్ జోషి

హైదరాబాద్, జనవరి 11 (నమస్తే తెలంగాణ): దేశీయ తయారీ రంగాన్ని మరింత బలోపేతం చేయడంలో వెల్డింగ్ టెక్నాలజీ అత్యంత కీలకమని 'అడ్వాన్స్డ్ వెల్డింగ్ టెక్నాలజీస్ ఇన్నేషన్ మిషన్స్ ప్రోగ్రామ్స్' (ఏడబ్ల్యూటీఎన్‌ఎంపీ) చైర్మన్ డాక్టర్ జైతీర్థ్ ఆర్ జోషి అన్నారు. గురువారం హైదరాబాద్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వెల్డింగ్ (ఐఐడబ్ల్యూ) బ్రాంచ్‌లో డీఆర్‌డీఎల్, ఏడబ్ల్యూటీఎన్‌ఎంపీ సంయుక్త నిర్వహణలో రెండు రోజుల వర్క్‌షాప్ ప్రారంభమైంది. ఈ సందర్భంగా జోషి మాట్లాడుతూ.. దేశ ఆర్థిక వ్యవస్థ వృద్ధిలోనూ వెల్డింగ్ టెక్నాలజీ పాత్ర ఉన్నదన్నారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ శాస్త్రవేత్త, డీఆర్‌డీఎల్ డైరెక్టర్ జీఏ శ్రీనివాస మూర్తితోపాటు డీఎంఆర్‌ఎల్ మాజీ డైరెక్టర్ జీ మధుసూధన్ రెడ్డి, ఐఐడబ్ల్యూ హైదరాబాద్ శాఖకు చెందిన శ్రీనివాస మూర్తి వివిధ ప్రయోగశాలల నుంచి 120 మందికిపైగా సైంటిస్టులు హాజరయ్యారు.

# 1.7 లక్షల కోట్లపై భారత్, తుర్కియే కన్ను

హైదరాబాద్, జనవరి 11(నమస్తే తెలంగాణ) భారత్, తుర్కియే దేశాల ద్వైపాక్షిక వాణిజ్య లక్ష్యం ఈ ఏడాది 20 బిలియన్ డాలర్లు (1.7 లక్షల కోట్లు)గా నిర్ణయించినట్లు తుర్కియే కాన్సుల్ జనరల్ ఆర్గాన్ యల్మాన్ ఓకాన్ పేర్కొన్నారు. గత ఏడాది ఇరు దేశాల మధ్య 12 బిలియన్ డాలర్ల వాణిజ్యం జరిగిందని చెప్పారు. ఎఫ్‌టీసీసీఐకి చెందిన వ్యాపార ప్రతినిధులు గురువారం ఫెడరేషన్ భవన్‌లో తుర్కియే వ్యాపార ప్రతినిధి బృందంతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆర్గాన్ మాట్లాడుతూ వాణిజ్య లక్ష్యాన్ని చేరుకోవడంలో తనవంతు సహకారం అందిస్తానని, ఎటువంటి ఇబ్బందులు తలెత్తినా తనను సంప్రదించవచ్చని భరోసా ఇచ్చారు. భారత్, తుర్కియేల మధ్య సంబంధాలు నిజామ్ కాలం నుంచే ఉన్నాయని గుర్తుచేశారు. ఎఫ్‌టీసీసీఐ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ సురేష్ సింఘాల్, ఆగ్రో ఫుడ్ అండ్ ఫుడ్ ప్రాసెసింగ్ చైర్మన్ చంద్రమోహన్ తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.



# బీఎండబ్ల్యూ రికార్డు విక్రయాలు

న్యూఢిల్లీ, జనవరి 11: జర్మనీకి చెందిన విలాసవంతమైన కార్ల తయారీ సంస్థ బీఎండబ్ల్యూ..దేశీయ మార్కెట్‌పై మరింత పట్టుసాధిస్తున్నది. 2023లో సంస్థ 22,940 యూనిట్ల లగ్జరీ కార్లు, మోటర్‌సైకిళ్లను విక్రయించింది. వీటిలో బీఎండబ్ల్యూ, మినీ బ్రాండ్‌లకు చెందిన 14,712 యూనిట్ల విక్రయాలు జరిపిన సంస్థ..8,768 యూనిట్ల మోటర్‌సైకిళ్లను అమ్మకాలు జరిపింది. 2022లో విక్రయించిన 19,263 యూనిట్ల కంటే ఇది 19 శాతం అధికం. ఈ సందర్భంగా బీఎండబ్ల్యూ గ్రూపు ఇండియా ప్రెసిడెంట్ విక్రమ్ పవాహ్ మాట్లాడుతూ..2023లో రికార్డు స్థాయి విక్రయాలు జరిపినట్లు, ముఖ్యంగా బీఎండబ్ల్యూ, మినీ, బీఎండబ్ల్యూ మోటరాడ్ బైకులకు కస్టమర్ల నుంచి విశేష స్పందన లభించినట్లు చెప్పారు. ఈ ఏడాది కూడా దేశీయ మార్కెట్లోకి 19 నూతన మాడళ్లను విడుదల చేయనున్నట్టు ఆయన ప్రకటించారు. వీటిలో రెండు ఈవీలను కలుపుకొని 13 కార్లు, ఆరు బైకులు ఉన్నాయని చెప్పారు. 2023లో సంస్థ 23 నూతన మాడళ్లను అందుబాటులోకి తీసుకొచ్చిన విషయం తెలిసిందే. 2025 నాటికి మొత్తం వాహన విక్రయాల్లో ఈవీల వాటా 25 శాతంగా ఉంటుందన్న ఆయన..అందుకోసం ఇప్పటి నుంచే ప్రతియేటా పలు మాడళ్లను అందుబాటులోకి తీసుకోస్తున్నట్లు చెప్పారు.

**పన్నులను హేతుబద్ధీకరించాలి..**

నూతన టెక్నాలజీ ఆపాదించుకోవడం, ఎలక్ట్రిక్ వాహనాలపై విధిస్తున్న పన్నులను హేతుబద్ధీకరించాల్సిన అవసరం ఉన్నదని విక్రమ్ వ్యాఖ్యానించారు. ఇతర దేశాల నుంచి దిగుమతి అవుతున్న వాహనాలపై పన్నులు అధికంగా ఉన్నాయని, దీంతో కొనుగోలుదారులపై అధిక భారం పడుతున్నదని, దీనిని తగ్గించాల్సిన అవసరం ఉన్నదని, అప్పుడే తక్కువ ధరకే వాహనం లభించనున్నదన్నారు. ప్రస్తుతం సీబీయూఎస్‌లపై కస్టమ్స్ డ్యూటీని 60 శాతం నుంచి 100 శాతం విధిస్తున్నారు. దిగుమతి చేసుకునే వాహనాలపై రాయితీలు ఇవ్వాలన్న ప్రతిపాదనేది తమ వద్ద లేదని, దిగుమతి సుంకాలను ఆమోదయోగ్య స్థాయిలో విధించాలని కోరుతున్నట్లు చెప్పారు. నూతన టెక్నాలజీ కోసం సంస్థ భారీగా పెట్టుబడులు పెడుతున్నదని, ఎలాంటి రాయితీలు ఇవ్వకపోయినప్పటికీ కస్టమర్లు కోరుకుంటున్న విధంగా కార్లను తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు. భారత్‌లో లగ్జరీ కార్ల మార్కెట్ చాలా తక్కువగానే ఉన్నదని, దేశవ్యాప్తంగా అమ్ముడువుతున్న ప్యాసింజర్ కార్లలో ఈ వాటా కేవలం ఒక్క శాతం మాత్రమేనని స్పష్టంచేరు. దేశ ఆర్థిక పరిస్థితులు, కొనుగోలుదారుల సెంటిమెంట్ ఆధారంగా లగ్జరీ కార్లకు డిమాండ్ ఉంటుందనే అభిప్రాయాన్ని వ్యక్తంచేశారు.



ఎన్ఐసీఎంఏఆర్ డైరెక్టర్ జనరల్ అనిల్ కశ్యప్‌కు ప్లాటినం సర్టిఫికెట్‌ను అందజేస్తున్న సీఐఐ తెలంగాణ చైర్మన్ సీ శేఖర్ రెడ్డి

# ఓల్డ్ బ్రిడ్జి నూతన ఫండ్ ఆఫర్

హైదరాబాద్, జనవరి 11: ఓల్డ్ బ్రిడ్జి మ్యూచువల్ ఫండ్ తాజాగా నూతన ఫండ్ ఆఫర్ చేసింది. ఈ నెల 17న ప్రారంభం కానున్న ఈ ఫండ్ ఆఫర్ 19న ముగియనున్నదని తెలిపింది. ఈ ఫండ్ ద్వారా సేకరించిన నిధులను 30 అతిపెద్ద స్టాక్‌లలో ఇన్వెస్ట్ చేయనున్నట్టు కంపెనీ వర్గాలు వెల్లడించాయి. కనీసం ఎస్ఐపీ పెట్టుబడి రూ.2,500గా నిర్ణయించింది సంస్థ.

# వీఐపై రూ.13.16 కోట్ల జీఎస్టీ జరిమానా

న్యూఢిల్లీ, జనవరి 11: వొడాఫోన్ ఐడియా (వీఐ)పై చండీగఢ్‌లోని కేంద్ర వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) అదనపు కమిషనర్ కార్యాలయం రూ.13.16 కోట్ల జరిమానా వేసింది. జీఎస్టీ విధానానికి సెంట్రల్ వ్యాట్ క్రెడిట్ బదిలీ తప్పులకుగాను ఈ ఫైన్ పడింది. ఈ జరిమానాను న్యాయపరంగా సవాల్ చేస్తామని కంపెనీ చెప్తున్నది.

# క్రిప్టోలపై మా వైఖరి మాది

## రెగ్యులేషన్ల విషయంలో ఇతరులను అనుకరించం • ఆర్బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ స్పష్టం



ముంబై, జనవరి 11: మేము ఎవ్వరినీ ఫాలో అవ్వబోమంటున్నారు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) గవర్నర్ శక్తికాంత దాస్. రెగ్యులేషన్స్‌కు వచ్చేటప్పుడు సొంత నిర్ణయాలే తప్ప, వాళ్లను.. వీళ్లను అనుకరించేది లేదని స్పష్టం చేశారు. ఈ క్రమంలోనే క్రిప్టోకరెన్సీలపై మా వైఖరి మాదని కుండబద్దలు కొట్టేశారు. క్రిప్టోలపై మాకున్న అభిప్రాయం, నిర్ణయాల్లో మార్పు లేదని తేల్చిచెప్పారు. బిట్‌కాయిన్ ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్స్ (ఈటీఎఫ్‌లు)కు అమెరికా రెగ్యులేటర్లు అనుమతినిచ్చిన నేపథ్యంలో దాస్ పైవిధంగా స్పందించారు. 'మరో మార్కెట్‌కు మంచిదనిపించింది.. మనకు మంచిది కానవసరం లేదు. అందువల్ల మన అభిప్రాయాలు మనవి. ఈ విషయంలో ఆర్బీఐది, నాది ఒకే మాట' అన్నారు. గురువారం ఇక్కడ ప్రముఖ జాతీయ వ్యాపార దినపత్రిక మింట్ నిర్వహించిన బీఎఫ్‌ఎస్‌ఐ సెమినార్‌కు దాస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అభివృద్ధి చెందుతున్న దేశాలకైనా, అభివృద్ధి చెందిన దేశాలకైనా క్రిప్టోకరెన్సీలు పెను ప్రమాదమేనని వ్యాఖ్యానించారు. క్రిప్టోలు దేశ ఆర్థిక స్థిరత్వాన్నే ప్రశ్నార్థకం చేస్తాయని చెప్పుకొచ్చారు. నిజానికి అమెరికా క్యాపిటల్ మార్కెట్స్ రెగ్యులేటర్ ఎస్ఈసీ సైతం క్రిప్టోల విషయంలో జాగ్రత్తని మదుపరులను హెచ్చరించినట్టు గుర్తుచేశారు. 'ఇతర దేశాల రెగ్యులేటర్లు ఏం చేశారన్న దానిపై నేను మాట్లాడదల్చుకోలేదు. వారి దేశానికి ఏది ఉత్తమమో వారికి తెలుసు. అయితే నా వరకు నేను చెప్తున్నదేమిటంటే దానితో జాగ్రత్త' అని క్రిప్టోలనుద్దేశించి దాస్ హితవు పలికారు. ఈ క్రిప్టో మానియా సరికాదని కూడా చెప్పారు.

**యూపీఐ అత్యుత్తమం**

యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ లేదా యూపీఐ.. ప్రపంచంలోనే అత్యుత్తమ చెల్లింపుల వ్యవస్థని ఆర్బీఐ గవర్నర్ దాస్ అన్నారు. దేశవ్యాప్తంగా యూపీఐ సేవలు పెద్ద ఎత్తున విజయవంతమయ్యాయని చెప్పారు. ఈ క్రమంలోనే గత కొద్ది నెలలుగా యూపీఐ, దాని సృష్టికర్త నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ)పై వస్తున్న విమర్శల్ని ఆయన కొట్టిపారేశారు. డిజిటల్ పేమెంట్స్ రంగంలో ఎన్‌పీసీఐ గుత్తాధిపత్యం చలాయిస్తున్నదన్న విమర్శలు వస్తున్నాయి. దీంతో నిజానికి ఎన్‌పీసీఐకి పోటీగా ఇతర యాప్‌ల పరిచయానికి దరఖాస్తుల్ని ఆహ్వానించామని, కానీ ఇప్పటిదాకా ఒక్కటీ రాలేదని దాస్ వెల్లడించారు. కాగా, చాలా నెలల కిందటే దేశంలో యూపీఐ లావాదేవీల సంఖ్య 100 బిలియన్ల మార్కును దాటింది. సింగపూర్, యూఏఈల్లోనూ యూపీఐ సేవలు నడుస్తున్నాయి. మరికొన్ని దేశాల్లోనూ దీని రాకకు ప్రయత్నాలు జరుగుతున్నాయి.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.